నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 8 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 7 : ముల్కల్లలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నందున ప్రిన్సిపాల్ మోహన్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు బుధవారం ఆర్‌సీవో స్వరూపారాణికి వినతి పత్రం అందజేశారు. ప్రిన్సిపాల్ అందుబాటులో ఉండడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విచారణ జరిపి ప్రిన్సిపాల్, సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సల్మాన్ పాషా, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జుమ్మిడి గోపాల్ పాల్గొన్నారు.

కిరిడిలో కలెక్టర్ పర్యటన

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవ్ రావు

వాంకిడి, ఫిబ్రవరి 7 : మండలంలోని కిరిడి గ్రామంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవ్‌రావు బుధవారం పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, గ్రామస్తులు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి పనులు పూర్తి చేయాలని, వానకాలంలో ఒర్రె ఉప్పొంగి పాఠశాలలోకి వరద వస్తుందని, ఆ ఒర్రెపై కల్వర్టు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే ఒర్రెపై కల్వర్టు పనులు ప్రారంభించేలా చూడాలని వాంకిడి తహసీల్దార్ రహీమొద్దీన్‌కు సూచించారు. పంచాయతీకి నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరడంతో హామీ ఇచ్చారు. కలెక్టరేట్ సిబ్బంది, నాయకులు ఉన్నారు.

సోనాపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

రెబ్బెన, ఫిబ్రవరి 7 : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారీ పేర్కొన్నారు. బుధవారం గోలేటితో పాటు సోనాపూర్, కోలాంగూడ గ్రామాల్లో పర్యటించారు. ర్యాలీలో పాల్గొని పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతు గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని, వీధి దీపాల ఏర్పాటు, మంచినీరు అందించడం, మురుగు కాలువలు శుభ్రం చేయడంవంటి పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. గ్రామస్తులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్యఆనందరావు, జడ్పీటీసీ వేముర్ల సంతోశ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీలు దుర్గం శ్రీవాణి, లావుడ్య సాగరమ్మ, పంచాయతీ కార్యదర్శి జలందర్ ఉన్నారు.

రేకుల డబ్బా నా.. శిక్షణ కేంద్రమా..?

ఐటీఐలోని తరగతి గదుల దుస్థితి

అధ్వానంగా డింపి ఐటీఐ

- కనీస సౌకర్యాలు నిల్
- అధ్యాపకులు లేరు.. విద్యార్థులు రారు..
- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

మంచిర్యాలలోని డింపి ఐటీఐ

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 7 : పట్టణంలోని రాంనగర్‌లో గల డింపి ప్రైవేటు ఐటీఐ అధ్వానంగా ఉంది. ఎప్పుడు చూసినా తాళం వేసే ఉంటుంది. ఎప్పుడైనా యాజమాన్యం వస్తే తాళం తీస్తారు.. ఆ తర్వాత మూసేస్తుంటారు. ఒకవేళ తెరచినా రేకుల షెడ్లు, తుప్పు పట్టిన బెంచీలు, మూలకు పడేసిన వస్తువులు తప్ప మరేవీ కనిపించవు. డంపు యార్డును తలపిస్తుందే తప్ప.. శిక్షణ కేంద్రంలా కనిపించదు.

అధ్యాపకులు లేరు.. విద్యార్థులు రారు..

ఈ ప్రైవేటు ఐటీఐలో రెండు ట్రేడ్‌లు నడుస్తున్నాయి. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు టెక్నికల్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకుంటే ఇందులో కనిపించేవి చెత్తా.. చెదారమే. ఈ ఐటీఐలో రెండు (ఎలక్ట్రిషియన్, ఫిట్టర్) ట్రేడ్‌లున్నాయి. ఎలక్ట్రిషియన్ ట్రేడ్‌లో 10 యూనిట్లుండగా, ఫిట్టర్‌లో 2 యూనిట్లు ఉన్నాయి. యూనిట్‌కు 20 సీట్ల చొప్పున ఎలక్ట్రిషియన్‌కు 200 సీట్లు, ఫిట్టర్‌కు 40 సీట్లు ఉన్నాయి. కానీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఒక్క అధ్యాపకుడు లేరు. ప్రాక్టికల్స్ చేసేందుకు అవసరమైన పరికరాలు, యంత్రాలు లేవు. ఇక విద్యార్థులు నేర్చుకునేదెలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కనీస సౌకర్యాలు నిల్...

కళాశాల ఆవరణ అంతా చెత్తా.. చెదారంతో నిండి ఉండటంతో పాటు విష సర్పాలు, పురుగులు వచ్చే అవకాశముంది. విద్యార్థుల కోసం తాగు నీరు, కుర్చీలు, బాత్రూంలు కూడా సరి గా లేవు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే ఇంక అంతే. సంబంధిత పరికరాలు లేవు. కనీస సౌ కర్యాలు లేకుండా ఐటీఐ కొనసాగుతుండగా, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శ లు వెల్లువెత్తుతున్నాయి. 2021-23లో 124 అడ్మిషన్లు కాగా, 2022-24లో 23, 2023-25లో ఇప్పటి వరకు సుమారు 80 (ఇంకా జరుగుతున్నాయి) అడ్మిషన్లు అయ్యాయి. విద్యార్థులకు ఇక్కడి పరిస్థితి తెలియక జాయిన్ అయి ఇబ్బందులు పడుతున్నారు.

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

డింపి ఐటీఐలో అధ్యాపకులు లేరని, ఇన్‌ఫ్రా, కనీస మౌలిక సదుపాయాలు లేవని కలెక్టర్‌కు, ఫైర్ అధికారులకు విన్నవించినా ఎలాంటి స్పందన లేదు. ఐటీఐ గుర్తింపు రద్దు చేయాలని హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదినికి వినతి పత్రం అందజేశాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. -

చేరాల వంశీ,
జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రత్యేకావసరాల పిల్లలకు చేయూతనిద్దాం

- డీఈవో యాదయ్య

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 7 : ప్రత్యేకావసరాలు గల పిల్లలకు చేయూతనిద్దామని, వారి అభ్యున్నతి కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో గుజరాత్‌కు చెందిన వుయ్ హియర్ ఇన్నోవేషన్ ప్రైవేటు లిమిటెడ్, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగులకు పరికరాలు అందించేందుకు నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఈ క్యాంపునకు 43 మంది విద్యార్థులు హాజరుకాగా, 33 మంది వినికిడి పరికరాలు పొందేందుకు అర్హులయ్యారని సంస్థ ప్రతినిధులు వెల్లడించారన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మొబులైజేషన్ అధికారి చౌదరి, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ మూర్తి, సైన్స్ అధికారి మధుబాబు, సంస్థ ప్రతినిధులు సాహిల్, కులదీప్, రోహన్, జిల్లాలోని ఐఆర్పీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దపులుల ఆవాసానికి ఏర్పాట్లు చేయాలి

- డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్
- కాళేశ్వరం, బాసర జోన్‌లలోని 55 మంది సిబ్బందికి అవగాహన

మాట్లాడుతున్న మంచిర్యాల డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్

జన్నారం, ఫిబ్రవరి 7 : కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ ఫారెస్ట్‌లో పెద్ద పులుల ఆవాసానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అటవీశాఖ కమ్యూనిటీ హాల్‌లో కాళేశ్వరం, బాసర జోన్‌లలోని 55 మంది అటవీ శాఖ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. కవ్వాల్ టైగర్ రిజర్వుడ్‌లోని అడవుల్లో నాలుగు రోజుల పాటు వివిధ అంశాలపై అధ్యయనం చేస్తామని, ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ఇకపై చేపట్టబోయే పనులపై ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అడవులు, వన్యప్రాణుల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, కలప స్మగ్లింగ్ నిరోధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అరుణాచల్‌ప్రదేశ్ రిటైర్డ్ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ యోగేశ్, మధ్యప్రదేశ్ రిటైర్డ్ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అలోక్ కుమార్, నిర్మల్, ఆసిఫాబాద్, డీఎఫ్‌వోలు రాంకిషన్‌యాదవ్, టెబ్రివాల్, రేంజ్ ఆఫీసర్లు హఫీసొద్దీన్, అప్పలకొండ, రత్నాకర్‌రావు, సుష్మారావు, డీఆర్వోలు, సెక్షన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కొనుగోళ్ల ఊసెత్తని జీసీసీ

- అటవీ ఉత్పత్తుల సేకరణపై అధికారుల నిర్లక్ష్యం
- ఇప్పటికీ గిట్టుబాటు ధరలు నిర్ణయించని వైనం
- గిరిజనుల ఉపాధిపై నీలినీడలు
- ఇకనైనా స్పందించాలని వేడుకోలు

అటవీ ఉత్పత్తులు సేకరిస్తున్న గిరిజనులు (ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ) : జిల్లా గిరిజన సహకార సంస్థ (జీసీసీ) నిర్లక్ష్యం.. గిరిజనులకు శాపంగా మారుతున్నది. రాత్రనకా.. పగలనకా.. అష్టకష్టాలు పడి సేకరించే అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లపై ఆసక్తి చూపకపోవడంతో వారు ఉపాధిని కోల్పోయే పరిస్థితి దాపురిస్తున్నది. గతేడాది అరకొరగా కొనుగోళ్లు చేపట్టగా, ఈ యేడాది అసలు ఆ ఊసెత్తడం లేదంటూ అడవిబిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 15 మండలాలు ఉండగా, ఇందులో 13.. గిరిజన మండలాలే ఉండడం గమనార్హం. వర్షాకాలంలో వ్యవసాయం చేసుకునే గిరిజనులు.. వేసవి(మార్చి, ఏప్రిల్, మే)లో మాత్రం అటవీ ఉత్పత్తులపైనే ఎక్కువగా ఆధారపడి జీవిస్తుంటారు. ఇప్పపూలు, ఇప్పపరక, చిల్లగింజలు, తేనె, జిరుగు, మైనం వంటివి సేకరించి జిల్లా గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డీఆర్ డిపోల్లో అమ్ముకొని ఆర్థిక అవసరాలు వెళ్లదీసుకుంటారు.

పట్టించుకోని జీసీసీ

అడవుల్లో గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తుల సేకరణను ప్రోత్సహిస్తూ.. వాటిని కొనుగోలు చేయాల్సిన జీసీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యేటా ఫిబ్రవరిలో అటవీ ఉత్పత్తుల ధరలను నిర్ణయించాల్సి ఉండగా, ఈ యేడాది అసలు పట్టించుకోవడం లేదు. అధికారులు అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అత్యధిక గిరిజన గ్రామాలున్న జిల్లాను అటవీ ఉత్పత్తుల సేకరణలో ముందంజలో ఉండాల్సి ఉండగా, వారి అలసత్వంతో లక్ష్యం నెరవేరడం లేదు.

గిట్టుబాటు కల్పించని అధికారులు

అడవుల్లో ప్రాణాలకు తెగించి గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులకు అధికారులు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమవుతున్నారు. నామమాత్రంగా ధర చెల్లిస్తున్నారు. తేనె ధర మార్కెట్‌లో కిలోకు రూ. 400 నుంచి రూ. 500 వరకు పలుకుతుంటే.. జీసీసీ అధికారులు మాత్రం కిలోకు రూ. 150 చొప్పున ధర నిర్ణయిస్తున్నారు. ఇప్పపూలకు వ్యాపారుల వద్ద కిలోకు రూ. 40 ఉంటే.. జీసీసీలో మాత్రం రూ. 20 కిలో ధర ఉంటోంది. ఇలా అన్ని అటవీ ఉత్పత్తులపై మార్కెట్‌లో కంటే సగానికి సగం తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. కష్టపడి సేకరించిన ఉత్పత్తులకు గిట్టుబాట ధర చెల్లించకపోవడంతో గిరిజనులు.. వాటిని సేకరించేందుకు కూడా ఆసక్తి చూపడం లేదని తెలుస్తున్నది. గిరిజనులు సేకరించే ఇప్పపూలను బహిరంగా మార్కెట్‌లో నేరుగా అమ్ముకునే వీలుండదు.. జీసీసీ ఏర్పాటు చేసిన డీఆర్ డిపోల్లోనే అమ్మాల్సి ఉంటుంది. అధికారుల నిర్లక్ష్యంతో ఉపాధి కోల్పోయే అవకాశముందని, ఇకనైనా స్పందించి జీసీసీ ద్వారా ప్రత్యేక మద్దతు ధర కల్పించి అటవీ ఉత్పత్తుల సేకరణను ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు.

నీల్వాయి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో నరేందర్, అధికారులు

పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలి

వేమనపల్లి, ఫిబ్రవరి 7 : పల్లెల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని జడ్పీ సీఈవో నరేందర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని నీల్వాయి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలు, మహిళలు, యువతను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రత్యేకాధికారులు సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ర్యాలీ తీశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ఎంపీపీ స్వర్ణలత, ఎంపీడీవో లక్ష్మయ్య గ్రామసభలను నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గాలి మధు, కుబిడె మధుకర్, కొండగొర్ల బాపు, శ్రీనివాస్, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్, సిబ్బందికి మెమోలు

హాజీపూర్, ఫిబ్రవరి 7 : ముల్కల్ల సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కళాశాలను బుధవారం ఆర్సీవో స్వరూప సందర్శించారు. మంగళవారం పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఆందోళన చేసిన నేపథ్యంలో బుధవారం సందర్శించి పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్, సిబ్బందికి మెమోలు జారీ చేసి హెచ్చరించారు.

ఈ నెల 8న ఉమ్మడి జిల్లా సమావేశం

నస్పూర్,ఫిబ్రవరి 7 : ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు, ప్రత్యేక కార్యదర్శి భారతి లక్పతినాయక్‌చే ఈ నెల 8న నిర్మల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మూడో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా ఎన్నికల, సహాయ ఎన్నికల, రిటర్నింగ్, బూత్‌స్థాయి అధికారులు హాజరవుతారని, జిల్లా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

సీఎంఆర్ గడువు పెంపు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 7 : మంచిర్యాలలోని ఎఫ్‌సీఐ(ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారుల నిర్లక్ష్యంతో జనవరి 31న దించాల్సిన 13 ఏసీకేల కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను బుధవారం ఎఫ్‌సీఐ అధికారులు అన్‌లోడ్ చేయించారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 29వ తేదీ వరకు గడువు పెంచుతూ మంగళవారం ఆదేశాలు జారీ చేయడంతో మిల్లర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

13 ఏసీకేల బియ్యం..

జనవరి 31న దించాల్సిన 13 ఏసీకేల కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను బుధవారం ఎఫ్‌సీఐ అధికారులు అన్‌లోడ్ చేయించారు. 31న 43 ఏసీకేల బియ్యం రాగా.. ఇందులో 33 ఏసీకేల బియ్యం మాత్రమే దించుకున్నారు. రాత్రి 12 గంటల తర్వాత కాంటా ఆన్‌లైన్ ఆగిపోవడంతో 13 ఏసీకేల బియ్యం ఉన్న లారీలు మూడు రోజుల పాటు ఎఫ్‌సీఐలోనే ఉన్నాయి. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంలో మిల్లర్లపై అధికారులు ఒత్తిడి తెచ్చి వెనక్కి పంపించారు. తిరిగి గడువు పెంచుతూ ఆదేశాలు రాగానే మిగతా 13 ఏసీకేల సీఎంఆర్‌ను అన్‌లోడ్ చేయించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 82 మంది గైర్హాజరు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 7 : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన పరీక్షల్లో 82 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షలో 698 (362 జనరల్, 336 వొకేషనల్) మంది విద్యార్థులకుగాను 641 (338 జనరల్, 303 వొకేషనల్) మంది పరీక్ష రాయగా, 57 (24 జనరల్, 33 వొకేషనల్) మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 469 (220 జనరల్, 249 వొకేషనల్) మంది విద్యార్థులకుగాను 444 (209 జనరల్, 235 వొకేషనల్) మంది పరీక్ష రాయగా, 25 (11 జనరల్, 14 వొకేషనల్) మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను డీఐఈవో శైలజ తిరిగి పరిశీలించారు.

శ్రీహర్ష కళాశాలలో ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న డీఐఈవో శైలజ

సామూహికంగా చేసిన వంటలను పంచుకుంటున్న మెస్రం వంశీయుల మహిళలు

మెస్రం వంశీయులతో చర్చిస్తున్న పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ పటేల్

నాగోబాకు చేరుకున్న మట్టికుండలు

ఆలయం వెనుకభాగంలో భద్రపర్చిన మెస్రం వంశీయులు

మర్రిచెట్ల కింద కొనసాగుతున్న సంప్రదాయ పూజలు

కేస్లాపూర్ జాతరలో ప్రధానంగా ఉపయోగించే మట్టికుండలు నాగోబాకు చేరుకున్నాయి. బుధవారం ఉదయమే ఎడ్లబండ్లలో మట్టికుండలను తీసుకురావడానికి మర్రిచెట్ల నుంచి వెళ్లిన మెస్రం వంశీయులు మధ్యాహ్నానికి చేరుకున్నారు. తీసుకొచ్చిన కుండలను నాగోబా ఆలయం వెనుక భద్రపరిచారు. ఇంకా మర్రిచెట్ల ప్రాంతంలో సంప్రదాయ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా కచేరీలు నిర్వహించి, నాగోబా పూజలపై చర్చించారు. మెస్రం వంశీయుల్లోని 22 కితలవారీగా మహిళలు సామూహిక వంటలు చేశారు. నైవేద్యాలను కితలవారీగా పంచుకున్నారు. సామూహికంగా సహపంక్తి భోజనాలు చేశారు. మరికొందరు రాత్రి పూట చలిమంటలు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు పాల్గొన్నారు. - ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 7

పావనమడుగును పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్

తిర్యాణి, ఫిబ్రవరి 7 : పావనమడుగు గంగ పుణ్యక్షేత్ర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. బుధవారం మండలంలోని గడలపల్లి పంచాయతీ పరిధిలోని పావనమడుగు గంగ పుణ్యక్షేత్రంలో శ్రీశ్రీశ్రీ గోండి ధర్మ గురువు హహాండి కుపర్ లింగో జెండా ముట్టి మహాపూజకు, దర్బార్, జాతర ఉత్సవాలకు ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలసి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోండి సంస్కృతి దేశంలోనే గొప్పదైనదని, దానిని భావితరాలకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజన యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. జన్‌మన్ పథకం ద్వారా తోటి గ్రామాల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పావనమడుగు గంగ పుణ్యక్షేత్రం వద్ద భక్తుల కోసం షెడ్డు, గార్డెన్, మ్యూజియం నిర్మించి..సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. అన్నంతరం అన్నదానంలో పాల్గొన్నారు. గిన్నెధరి విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ, ఎస్ఐ రమేశ్, జీఎం రవిప్రసాద్, ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జడ్పీటీసీ చంద్రశేఖర్, ఎంపీటీసీ సారా రమేశ్ గౌడ్, మాజీ జడ్పీటీసీ వెడ్మ కమల, కార్యనిర్వహణ కమిటీ చైర్మన్ మడావి గుణవంతరావు, గోండ్వాన గణతంత్ర పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సిడాం అర్జు, జిల్లా సర్మేడీ కుర్సెంగ మోతీరాం, జంగో లింగో దీక్షాపరులు పాల్గొన్నారు.